క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ఆల రాక

కొత్తకోట: నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన 'ఆలన్న ఉద్యోగ యాప్' ఆవిష్కరించేందుకు శుక్రవారం కొత్తకోటకు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని బీపీఆర్ గార్డెన్‌లో ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి 'ఆలన్న ఉద్యోగ యాప్'ను ఆవిష్కరిస్తారని, మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలిరావాలని వామన్‌గౌడ్ కోరారు.

కరపత్రాలు పంపిణీ



పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి, కొత్తపేట గ్రామాల్లో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డా.పగిడాల శ్రీనివాసులు మాట్లాడారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత టీడీపీది అన్నారు. అనేక పేద కుటుంబాలకు వైద్యపరంగా తమ ఆస్పత్రి ద్వారా సేవలు అందిస్తున్నామని, వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ నుంచి ఒక్కసారి అవకాశం కల్పించి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణనాయుడు, ఆనంద్, ఆశయ్య, రామస్వామి, చంద్రయ్య, సుధాకర్, సత్యానారాయణ, జగదీశ్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

కాళికాలయంలో శ్రీచక్రం ప్రతిష్ఠాపన



అమరచింత: పట్టణంలోని కాళీకామాత ఆలయంలో శుక్రవారం శ్రీచక్ర ప్రతిష్ఠాపన పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాశీ పట్టణం నుంచి తీసుకొచ్చిన శ్రీచక్రాన్ని ఆయలంలో శుక్రవారం ప్రతిష్ఠించారు. అమ్మవారి ఆలయాల్లో శ్రీచక్రం ఉండటం సహజమని, అలాంటిది పట్టణంలోని కాళీకాలయంలో లేదని తెలిసి కాశీ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చి ఆలయంలో పెట్టామన్నారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోట్టం నాగేశ్వర్‌రెడ్డి, మేర్వరాజు భక్తులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీపీఎస్ సోషల్ వర్కర్ నరేందర్, చైల్డ్ లైన్ టీం సభ్యుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహ నిషేధ చట్టం 2006, డ్రాప్‌అవుట్ పిల్లలు, బాలకార్మికులపై అవగాహన కల్పిస్తూ టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారి నరసింహ, పాఠశాల ప్రత్యేకాధికారి పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కొల్లాపూర్ జడ్జిలు ఆర్‌వీఎస్ నితిన్ తేజ, గుంతి జ్యోత్స్న హాజరై మాట్లాడారు. విద్యార్థుల చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. పది, ఇంటర్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు అందజేస్తానని జడ్జి జ్యోత్స్న ప్రకటించారు. కార్యక్రమంలో అడ్వకేట్ల ప్రెసిడెంట్ వసంత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజు, బాలస్వామి, రాజేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పెద్ద కొత్తపల్లి: మండలంలోని దేవినేనిపల్లిలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి ఇల్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శారద కిష్టయ్య కుటుంబసభ్యులతో కలిసి గొర్రెలు మేపడానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించింది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక

కొత్తకోట రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై పర్యావరణాన్ని కాపాడాలని మనిగిల్ల జెడ్పీహెచ్ హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మనిగిల్ల జెడ్పీహెచ్‌లోని 150మంది విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ ఒక మొక్క చొప్పున మొత్తం విద్యార్థులందరికీ 150మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటంతో విద్యార్థులు భాగస్వాములు కావాలని, మొక్కలు నాటేందుకు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గతేడాది మొక్కలు బాగా పెంచిన విద్యార్థులకు ఆగస్టు 15రోజున బహుమతులను అందజేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ, చంద్రకళ, విజయ్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మండలంలోని కనిమెట్ట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసే కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కూల్ డ్రస్సులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం జరిగిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు స్కూల్స్‌లో చక్కటి వాతావరణం వచ్చే విధంగా పచ్చని చెట్లు, విశాలమైన మైదానాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాదం రాణి, భీంరెడ్డి, గాడీల ప్రశాంత్, మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, కృష్ణయ్యగౌడ్, పరమేష్, కృష్ణకుమార్, మన్నెంకొండ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, కుర్మన్న, రాము, రవి, హెచ్‌ఎం లక్ష్మయ్య పాల్గొన్నారు.



మనిగిల్లలో విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న హెచ్‌ఎం శంకర్‌గౌడ్

'చలో హైదరాబాద్'కు తరలిరండి



మాట్లాడుతున్న గౌస్

అమరచింత: సీపీఎస్ రద్దు, పాత పింఛన్ సాధన కోసం శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గౌస్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆయా ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు తమకు కొత్త పెన్షన్ విధానం వద్దని, పాత పెన్షన్ విధానమే అమలు పర్చాలని ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్రం అంతటా తమ సంఘం ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా యాత్రలు నిర్వహిస్తూ తమ హక్కుల కోసం పోరాడుతున్నామని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, రాములమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ తరఫున పోటీలో ఉంటా'

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికలల్లో కాంగ్రెస్ తరఫున పోటీలో ఉంటానని మండల వాసి, ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓయూ విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పనిచేశానని, నియోజకవర్గంలో పార్టీ తరఫున బీసీ అభ్యర్థిగా అధిష్ఠానం గుర్తించి వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తే పోటీలో ఉంటానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ, రూ.ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలు చేస్తారన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడదాం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్‌యాదవ్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 2వ సెంటర్‌లో గురువారం రాత్రి కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ హాజరై మాట్లాడారు. గ్రామాలల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టామన్నారు. రానున్న రోజులల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి తీసుకోవాల్సి చర్యలను ప్రజలతో చర్చించారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడుతూ సమస్యలను తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేయడం తప్పా మరేమి చేయట్లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, నాయకులు శివనారాయణ, శ్రీధర్, గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గోపాల్‌పేట: తనపై దాడిచేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వనపర్తి టౌన్ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సూరాపల్లి సత్యం, గొల్ల బొజ్జన్న ఈనెల 6న వనపర్తిలోని గాంధీనగర్ బొడ్రాయి చౌరస్తా వద్ద కూర్చొని ఉండగా.. గొల్ల జాని అనే వ్యక్తి వచ్చి బూతు మాటలు తిడుతూ తనతో పాటు బొజ్జన్నపై దాడి చేసి గాయపర్చాడని బాధితుడు సూరాపల్లి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లజానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ పేర్కొన్నారు.

రోడ్ల మరమ్మతుపై ప్రభుత్వానికి శ్రద్ధ ఏది?



గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ల మరమ్మతుపై శ్రద్ధ లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, జిల్లా నాయకులు రాంరెడ్డి, ఆశన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు పెట్రోల్ బంకు వద్ద ఏర్పడిన గుంతలను మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలతో పాటుగా జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు దుస్థితి ఇలా ఉంటే వాహనదారులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో గుంతలు ఉండటం వలన పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నా అధికారులకు, నాయకులకు పట్టడం లేదని వారు దుయ్యబట్టారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోతే మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, శివశంకర్, చక్రవర్తి, సుంకరి అంజనేయులు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌కు అనుమతి

పెబ్బేరు రూరల్: జిల్లా ఓపెన్ స్కూల్ విభాగం నుంచి శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలలో ఓపెన్ స్కూల్ సెంటర్‌కు అనుమతి లభించిందని హెచ్‌ఎం కురుమయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బడి మానేసిన విద్యార్థులు పదో వతరగతి, ఇంటర్మీడియట్ చదువును పూర్తి చేయడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం శ్రీరంగాపురం బాలుర పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

రూ.5 వేలు అందజేత

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని నందిమల్లగడ్డకు చెందిన నందిమల్ల లక్ష్మీదేవమ్మ శుక్రవారం మరణించడంతో మాజీ మంత్రి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డా.చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు చిన్నారెడ్డి అందించిన రూ. 5వేల నగదును అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి. వెంకటేష్ బాధిత కుటుంబానికి అందజేసి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ, చిన్నారెడ్డి బాధిత కుటుంబానికి అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో నాగార్జున, గంధం చిట్టెమ్మ తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో వారం రోజుల కిందట వేంకటేశ్వరస్వామి దేవాలయ అర్చకుడు శేషయ్యచార్యులు అనారోగ్యంతో మృతిచెందాడు. పలువురు అర్చకులు, గ్రామస్తులు విరాళాలు సేకరించి ఆలయ ట్రస్టు చైర్మన్ జంగం జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని చదవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వనపర్తి టౌన్: విద్యార్థులకు విస్నూతంగా, వారితో స్నేహపూర్వకంగా ఉండి అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధిస్తే వారు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గోనూరు యాదగిరి, డాక్టర్ లలిత కృష్ణకుమార్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 2022–23లో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నగదు బహుమతి అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివేందుకు పునాది పదో తరగతి అని, ఆ తరగతిలో విద్యార్థులకు నమ్మకం, విద్యాబుద్ధులు నేర్పితే సమాజంలో ఉన్నతంగా రాణించగలరని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయురాలు తారాబాయిని సైతం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు చెన్నపద్మ, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మారం బాలకృష్ణ, కందికొండ సాయిరాం, దాచ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

కొల్లాపూర్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు కమలం–గుండె గుండెకు ఎల్లేని కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. నాయకులు శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, పదర భీమేష్, అన్వేష్, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, భరత్‌చంద్ర తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన సింగిరెడ్డి వాసంతి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని గొల్లపల్లి ఆశ్రమం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి అన్నారు. శుక్రవారం ఆమె గొల్లపల్లి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమం చుట్టూ సీసీ రోడ్డు నిర్మించేందుకు, ఆశ్రమం నుంచి గుట్టపైకి పార్మేషన్ రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం మంత్రి తన సొంత నిధులు సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రేవల్లి ఎంపీపీ సేనాపతి, జెడ్పీటీసీ భీమయ్య, లోడె రఘు, సర్పంచ్‌లు రమేష్, సునీల్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం, మీసేవాల వద్ద బారులు



తహసీల్దార్ కార్యాలయంలో బారులు తీరిన జనం

పాన్‌గల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు అందజేసిన ప్రజలు అందుకు అవసరమైన కులం, ఆదా యం ధృవపత్రాలను పొందడానికి శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మీసే వా కేంద్రాల వద్ద గుమిగూడారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసిన వివిధ గ్రామాల ప్రజలు ఆయా ధృవపత్రాలు పొందడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధృవపత్రాలను ఆన్‌లైన్‌లో త్వరగా పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన



ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ మహేష్

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మహేష్ మాట్లాడుతూ ఎల్రక్టానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం), వీవీ ప్యాట్ పనితీరు వివరించారు. ఈవీఎంలో తమకు నచ్చిన అభ్యర్థి పేరు, గుర్తులకు ఎదురుగా ఉన్న బటన్ నొక్కితే కొన్ని సెకన్ల వ్యవధిలో బీప్ శబ్దంతో ఓటు నమోదవుతుంది. అయితే అది తాను అనుకున్న గుర్తుకు పడుతుందా లేదా అనేది తెలుసుకునేందుకు వీవీప్యాట్ యంత్రాలు ఈవీఎంకు అనుసంధానంగా ఉంటాయని తెలిపారు. ఓటు వేసిన తరువాత వీవీప్యాట్ యంత్రం నుంచి స్లిప్ వస్తుందని, ఈవీఎంలో తాను నొక్కిన గుర్తుకు ఓటు పడిందో, లేదో ఈ చీటి ద్వారా ఓటరు తెసుకోవచ్చన్నారు. ఆయా యంత్రాలపై ఓటర్లకు అవగాహనతో పాటు అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆర్‌ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాణి, పంచాయతీ కార్యదర్శి, ఓటర్లు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు శిక్షణ తరగతులు



శిక్షణను ప్రారంభిస్తున్న కమిటీ నాయకులు

ఖిల్లాఘనపురం: తెలంగాణ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మండలంలోని అన్ని గ్రామాల డప్పు కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం బాలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో డప్పు కళాకారుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పండుగలు, జాతర్లు, ఊరేగింపులు, రాజకీయ పార్టీల ఊరేగింపులు, చావులు, బతుకులు ఇలా ప్రతి కార్యక్రమానికి డప్పులు కొడుతూ జీవనం సాగిస్తున్న కళాకారుల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు ఈ సంఘం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే మండల కేంద్రంలో రెండు రోజుల పాటుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రంగన్న, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, మన్నెం, కేశవులు, కుర్మయ్య పాల్గొన్నారు.

'నా నేల నా దేశం' వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ కొగారే

కొత్తకోట రూరల్: నా నేల నా దేశం వారోత్సవాల్లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురం వారి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పామాపురంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కొగారే రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేల భూసార నిర్వహణ, అధిక రసాయన ఎరువుల వాడకం వలన నేల ఆరోగ్యం ఎలా క్షీణిస్తుందో రైతులకు వివరించారు. మట్టి పరీక్ష యొక్క ప్రాముఖ్యతని, మట్టి నమూన సేకరణ విధానాన్ని తెలియజేశారు. రైతులు పంటలు వేసే ముందు మట్టి పరీక్షలు చేసుకోవడం మంచిదని, వాటి ఆధారంగా పంటలు వేసుకుంటే ఎరువుల వాడకం తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. అనంతరం స్థానిక జెడ్పీహెచ్‌లో విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ భవాని, వ్యవసాయ విస్తరణ అధికారి జితేందర్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



మహా పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న ఆలయ సేవా సమితి సభ్యులు

పెబ్బేరు రూరల్: అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రారంభించిన 'గో మహా పాదయాత్ర' శుక్రవారం పెబ్బేరు పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీసాయి సేవా సమితి, అయ్యప్పస్వామి సేవా, హిందూవాహిని, ఆరెకటిక సంఘం సభ్యులు పాదయాత్రకు స్వాగతం పలికి సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గోవులను కాపాడాలని కోరుతూ ఈ పాదయాత్ర హైదరాబాద్‌లో ఆగస్టు 6 ప్రారంభమైన యాత్ర తిరుమల మీదుగా 789 కిలోమీటర్లు 25 రోజులో 30న పౌర్ణమి రోజు అరుణాచలం చేరుకుంటారని అఖిలభారత గ్రూప్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఎంహెచ్ టీ4 ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు చేసినట్లు ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ బాలస్వామి, డాక్టర్ దీపిక పేర్కొన్నారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల, హైదరాబాద్ ఉప కేంద్రం తూడుకుర్తి కూచకుళ్ల రామచంద్రారెడ్డి నేత్ర వైద్య కేంద్రం సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 220 మంది పాఠశాల విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించగా 120 మంది విద్యార్థినులకు వైరల్ కంటి సమస్య ఉన్నట్లు గుర్తించామని, 45 మందికి కంటిచూపు సమస్య ఉందని, అద్దాలు వాడాలని సూచించామన్నారు. 154 మంది విద్యార్థినులకు మందులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది దేవి చందర్‌రావు, వెంకటయ్య, కుమార్, విజయ్, టెక్నిషియన్, లక్ష్మి, ఆర్‌బీఎస్‌కే మెడికల్ డాక్టర్లు స్వప్న, రఘు, ఫార్మసిస్ట్ శ్రీవిద్య, ఏఎన్‌ఎం లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం హర్షణీయం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అమరచింత: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చారిత్రక విజయమని, సీఎం కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగులకు గుర్తింపు ఇవ్వడం సంతోషకరమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పటి నుంచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఎన్నో సార్లు ఆందోళనలు నిర్వహించినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో నాగభూషణంగౌడ్, ఆర్టీసీ ఉద్యోగులు రవిప్రకాష్, కృష్ణయ్య, శ్రీనివాస్, ఖాజాఖయ్యూం, శ్రీకాంత్, ఉంద్యాల శ్రీను, రుక్మద్దిన్ పాల్గొన్నారు.